క్లుప్తంగా

వీధి కుక్కలు పట్టివేత



వీధికుక్కను బంధించిన జీవీఎంసీ సిబ్బంది

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు పరిధి వెంకన్నపాలెం ప్రాంతంలో మంగళవారం వీధి కుక్కలను పట్టుకున్నారు. ఇక్కడ వీధి కుక్కల బెడద అధికంగా ఉండడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయందోళన చెందుతున్నారు. సమస్యను కాలనీ వాసులు వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించన ఆమె వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. దీంతో సిబ్బంది మంగళవారం ఆ ప్రాంతానికి వచ్చి ఆ సమయంలో సంచరిస్తున్న కుక్కలను బంధించారు.

ఆట, పాటలతో చిన్నారుల సందడి



చిన్నారులకు జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

మల్కాపురం: వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో పలువురు చిన్నారులు ఆటలు, పాటలతో మంగళవారం సందడి చేశారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ప్రముఖ న్యాయవాది విశ్వనాథరాజు, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్య లక్ష్మి న్యాయ నిర్ణేతులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా అక్కడ చిన్నారులు శాస్త్రీయ నృత్యాలు, సినిమా పాటలకు డ్యాన్స్‌లు చేశారు. పాటలు పాడి అలరించారు.

ఉత్సాహంగా 'బడి పిలుస్తోంది'



లక్ష్మీనగర్ ఈ-బ్లాక్‌లో బడి పిలుస్తోంది ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపట్నం: లక్ష్మీనగర్ ఈ-బ్లాక్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, గ్రామస్తులు మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పలు వీధుల్లో ర్యాలీ జరిపారు. బడిఈడు పిల్లల వివరాలు సేకరించి, వారి తల్లిదండ్రులను కలిసి బడికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.వరలక్ష్మి, ఉపాధ్యాయులు మోహనరావు, బండి దుర్గేష్, ఉమామహేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

18న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

నడిచే దారే లేదాయే!

జీవీఎంసీలో అత్యధిక రద్దీ ఉండే ప్రాంతాల్లో జోన్-5 ఒకటి. ఇక్కడ పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేసినా, అధికారుల నిర్లిప్తత, సిబ్బంది 'మామూళ్ల'వైఖరి వెరసి ఆక్రమణలకు, చిరు వ్యాపారాలకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో పాదచారులు సర్వీసు రోడ్లను ఆశ్రయిస్తున్నారు. ఈ రోడ్లను కూడా దుకాణదారులు తమ వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తుండటంతో స్థానికులకు ఇబ్బందులు నిత్యకృత్యమయ్యాయి.

- ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా వాహనాల నిలుపుదల
- ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాలు
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ, ట్రాఫిక్ యంత్రాంగం



పరమేశ్వరి థియేటర్ రహదారి ఫుట్‌పాత్‌పై దుకాణాలు



రెడ్డికంచరపాలెంలో అసంపూర్తిగా బీఆర్‌టీఎస్ కల్వర్టు



కంచరపాలెం కూడలిలో కానరాని ఫుట్‌పాత్‌లు

కంచరపాలెం : జీవీఎంసీ జోన్-5 పరిధిలో చేపట్టిన ఏ అభివృద్ధి కార్యక్రమమైనా మూణ్నాళ్ల ముచ్చటగానే ఉంటోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బీఆర్‌టీఎస్ మార్గాల్లో అభివృద్ధి చేసిన నడక మార్గాలు ప్రస్తుతం వాహనాల పార్కింగ్, చిరు వ్యాపారాలకు నిలయాలుగా మారాయి. కొన్ని చోట్ల ఇవి శిథిలావస్థకు చేరుకుని, ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి.

చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి మర్రిపాలెం, ఎన్ఏడీ కొత్తరోడ్డు, జ్ఞానాపురం, కాన్వెంట్ కూడలికి వెళ్లే మార్గాల్లో ఫుట్‌పాత్‌లు అభివృద్ధి చేసినా, నిర్వహణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పాడైన వాటిని అలానే ఉంచేయడంతో, కొన్ని చోట్ల నడిచేందుక్కూడా వీల్లేని దుస్థితి నెలకొంది. కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా, జ్ఞానాపురం, కాన్వెంట్ కూడలిలో ఫుట్‌పాత్‌లను పాదచారులకంటే వాహన చోదకులే ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో పాదచారులు బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్లలో నడవాల్సి వస్తోంది. పలుచోట్ల ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు, దుకాణ యాజమానుల వాహనాల పార్కింగ్ జరుగుతున్నా జోన్-5 పట్టణ ప్రణాళిక విభాగం, ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జోన్ అధికారుల నిర్లక్ష్యం

జోన్-5 పరిధిలో నడక మార్గాల అభివృద్ధికి కాంక్రీటుతో చదును చేసి, పైన టైల్స్ వేశారు. అయితే ఆయా ప్రాంతాల్లో కల్వర్టుల నిర్వహణ మాత్రం తూతూమంత్రంగానే ఉంది. బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా కల్వర్టుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను యంత్రాలతో తొలగించే సమయంలో సిమెంటు దిమ్మెలు విరిగిపోతున్నాయి. వీటిని అధికారులు అలానే వదిలేస్తున్నారు. మరోవైపు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

అడ్డుకోవాల్సిన అధికారులు, సిబ్బంది 'మామూళ్ల'గా మిన్నకుండిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా పెద్ద పెద్ద వాణిజ్య సముదాయాల నిర్వాహకులు తమ భవనాల సెల్లార్లలోకి వాహనాలను అనుమతించట్లేదు. వీరు నడక మార్గాలనే తమ వద్దకు వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు.

చర్యలు చేపడతాం



బీఆర్‌టీఎస్ రహదారిలో దుకాణాల యజమానులు కొందరు కోర్టును ఆశ్రయించడంతో అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. వాణిజ్య సముదాయాల యజమానులు, వాహన చోదకులకు పార్కింగ్‌పై అవగాహన కల్పిస్తాం. ఫుట్‌పాత్‌ల నిర్వహణపై ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులను సమావేశపరచి సమస్యల నియంత్రణకు చర్యలు చేపడతాం. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో ఫుట్‌పాత్ ఆక్రమణ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఆర్.జి.వి.కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్-5

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సచివాలయ కన్వీనర్లదే



సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న ఎస్‌ఏ రెహమాన్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో 89వ వార్డు సచివాలయ కార్యదర్శులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రెహమాన్ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు పార్టీకి, ప్రజలకు అనుసంధానంగా వ్యవహరించాలన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కన్వీనర్లదేనని చెప్పారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. మరింత ఉత్సాహంగా, బాధ్యతతో పని చేయాలని ఆయన సూచించారు. వార్డులో సమస్యలను పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు గానీ, కొత్తగా వేసిన వార్డు కమిటీ సభ్యులు అయితంశెట్టి గోపి, ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గేదెల మురళీకృష్ణ, గోపి, పైడిరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు కిట్ల పంపిణీ



నాయీ బ్రాహ్మణులకు కిట్లు అందిస్తున్న గోపి

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు నాయీ బ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు అయితంశెట్టి గోపి కులవృత్తికి సంబంధించిన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, నాయీబ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు ఆతవ సుబ్బారావు, కార్యదర్శి కొడమంచిలి భాస్కరరావు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- నేరాల నియంత్రణలో తోడ్పాటు అందించాలి
- సమావేశంలో సీపీ త్రివిక్రమ్‌వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి : ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ హామీ ఇచ్చారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (ఎస్‌బీ) గంగాధర్, ఏడీసీపీ (ట్రాఫిక్) అరీఫుల్లాతో కలిసి నగర ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అలాగే స్థానిక పోలీసులతో పూర్తి సమన్వయంతో నేరాల నియంత్రణ విషయంలో తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ-1 ఎం.జాన్‌మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ-2 రాజీవ్‌కుమార్‌తో పాటు వివిధ ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పొంగిన మురుగు కాలువ



నగరాల వీధిలో కాలువ నుంచి పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం నగరాల వీధిలో ఓ కాలువ మంగళవారం పొంగి పొర్లింది. కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు పోయే దారి లేకుండాపోయింది. దీంతో మురుగునీటితో పాటు వ్యర్థాలు కాలువ నుంచి బయటకు వచ్చి రోడ్డుపై ప్రవహించాయి. దుర్వాసన భరించలేక జనం ముక్కు మూసుకుని రాకపోకలు సాగించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికి స్థానికులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన వెంటనే సిబ్బందిని పంపి, కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపు చర్యలు చేపట్టారు. మురుగునీరు కాలువ గుండా ప్రవహించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏయూ విద్యార్థుల ఔదార్యం

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతికి రూ.లక్ష సాయం



చికిత్స పొందుతున్న యువతితో మాట్లాడుతున్న ఆచార్య హరనాథ్

ఏయూ క్యాంపస్ : ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వర్సిటీ పూర్వ విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి. గత నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పందిరి అనూరాధ తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమె సుదీర్ఘ కాలం చికిత్స అందించాల్సిన అవసరం ఉంది. పేద కుటుంబానికి చెందిన అనూరాధ చికిత్సకు అధికంగా ఖర్చవుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు జి.ధర్మారావు, వై.గోపీచంద్‌లు తమ స్నేహితులు, బంధువుల నుంచి విరాళాలు సేకరించారు. ముందుగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అనూరాధను సోషల్ వర్క్ విభాగాధిపతి ఎస్.హరనాథ్ స్వయంగా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకు ఉయుక్తంగా విద్యార్థులు సేకరించిన రూ 1,011,11ని బాధితురాలి తండ్రి రాముకు అందజేశారు. భవిష్యత్తులో సైతం అవసరమైన సహాయం అందిస్తామని చెప్పారు.

నాణ్యమైన భోజనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే దిశగా సిబ్బంది చిత్త శుద్ధితో పని చేయాలని చీఫ్ వార్డెన్ డాక్టర్ జి.వీర్రాజు అన్నారు. హాస్టల్ కార్యాలయంలో ఆయన ఉద్యోగులతో సమావేశమయ్యారు. ప్రధానంగా మెస్ పరిసరాలు, వంట శాలలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉద్యోగులు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పని చేయాలని చెప్పారు. విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడమే లక్ష్యంగా ప్రతి వ్యక్తి పని చేయాలన్నారు. ఉద్యోగులకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కరిస్తామన్నారు. సమష్టిగా పని చేస్తూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని తీర్చిదిద్దాలన్నారు.

స్టోర్స్ నిర్వహణ, కిరాణా, కూరగాయలు వంటివి నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. హాస్టళ్లకు వచ్చే నిత్యావసర వస్తువుల్లో నాణ్యత లోపం ఉంటే తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ నిర్దేశించిన విధంగా హాస్టళ్లకు కిరాణా వస్తువులు, కూరలు వంటివి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్‌లు రమణ మూర్తి, బుజ్జిబాబు, హాస్టల్ కార్యాలయం సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

దశ దిన సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న సంస్కృత భారతి ఆంధ్ర ప్రాంత సంపర్క్ ప్రముఖ్ నాగేశ్వరరావు

డాబాగార్డెన్స్: సంస్కృత భారతి ఆధ్వర్యంలో రాంనగర్‌లో గల విశాఖ సేవా సదన్ పాఠశాలలో మంగళవారం దశ దిన సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభమైంది. ప్రముఖ న్యాయవాది సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. సంస్కృత ప్రాముఖ్యతను వివరించారు. శిబిరం నిర్వహిస్తున్న సంస్కృత భారతిని అభినందించారు. అనంతరం సంస్కృత భారతి ఆంధ్ర ప్రాంత సంపర్క్ ప్రముఖ్ ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ పది రోజుల్లో సులభంగా సంస్కృతం మాట్లాడడంపై శిక్షణ ఇవ్వను న్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సంస్కృతం తెలయడం వల్ల మిగిలిన భాషలు సులభంగా మాట్లాడగలమని చెప్పారు. ఈ నెల 25 వరకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. వయసుతో పని లేదని, ఆసక్తి గల వారు ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సంస్థ జిల్లా కార్యదర్శి డాక్టర్ మల్లాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండగ



ఆలయంలో అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయంలో బంగారమ్మ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. పసుపు కుంకుమతో అభిషేకాలు చేశారు. చీరలు, గాజులు అమ్మవారికి సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు మజ్జిగ, తాగునీరు, ప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గణబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పండగ సందర్భంగా పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మరోవైపు పరసతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. పిల్లలు, పెద్దలు పరసలో తిరుగుతూ సంతోషంగా గడిపారు.

స్పీడ్ బ్రేకర్ల ఎత్తు తగ్గింపు

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుంచి పాత రామాలయం వరకు ఉన్న సేవా మార్గంలో పలు చోట్ల స్పీడ్ బ్రేకర్ల ఎత్తు తగ్గించారు. నిబంధనల కంటే స్పీడ్ బ్రేకర్ల ఎత్తు ఎక్కువగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి గాయపడుతున్నారు. దీనిపై సోమవారం భయపెడుతున్న స్పీడ్‌బ్రేకర్లు శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిబంధనల ప్రకారం స్పీడ్ బ్రేకర్ల ఎత్తును తగ్గించి సరి చేశారు. దీంతో కాలనీవాసులు, ద్విచక్ర వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

డెంగ్యూపై అవగాహన అవసరం



61వ వార్డులో అవగాహన ర్యాలీలో నాయకులు, అధికారులు



బుచ్చిరాజుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది, నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం అర్బన్ ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నియంత్రణ దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ రమణ పాల్గొని మాట్లాడారు. డెంగ్యూ వంటి వ్యాధులపై ప్రజలు అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యురాలు సీహెచ్ దీపిక మాట్లాడుతూ నీటిలో పెరిగే దోమల వల్ల డెంగ్యూ సోకుతుందని తెలిపా రు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ కార్యదర్శులు నాగలక్ష్మి, షేక్ జమీలా, శివలక్ష్మి, పప్పల సౌజన్య లక్ష్మి, బండారు లక్ష్మి, ఉమా మహేశ్వరి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీ వద్ద జాతీయ డెంగ్యూ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానికులకు అవగాహన కల్పించారు. మలేరియా విభాగ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి సత్యనారాయణ, జీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ డెంగ్యూ ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ అసిస్టెంట్ రవి, మలేరియా నివారణ విభాగ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ మారువారం జాతర



ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ

కంచరపాలెం : స్థానిక గొల్లకంచరపాలెం ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి మారువార జాతర మహోత్సవం శ్రీరామాసేవా సమాజం(యాదవ్) అధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. దుర్గానగర్‌లోని దుర్గా ఆలయంలో ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజి వేషాలు, నేల డాన్స్‌లు ఏర్పాటు చేశారు. తోటవీధిలో పుట్టబంగారం నుంచి అమ్మవారి ప్రధాన దేవాలయం వరకు జాతర వేడుకలు నిర్వహించారు. జాతర నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పరిశ్రమల్లో ప్రమాదాలు ఆందోళనకరం



సదస్సులో మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

అల్లిపురం: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ ప్రమాదాలకు కారణాలు ఏమిటి? వీటికి బాధ్యులెవరు? అనే అంశంపై అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులకు పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని, పరిశ్రమల్లో భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై భవిష్యత్ పోరాటాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సదస్సు ద్వారా పిలుపునిచ్చారు. సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పీపుల్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జగదీష్ పటేల్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, కేఎం శ్రీనివాస్, తేజేశ్వరరావు, ఫార్మా యూనియన్ నాయకులు రొంగలి రాము, రక్షణ రంగ యూనియన్ నాయకుడు నాగేశ్వరరావు, వివిధ పరిశ్రమల్లో ప్రమాదాలకు గురైన బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న షాపులకు జరిమానా



జరిమానా వేస్తున్న సచివాలయం కార్యదర్శి, జీవీఎంసీ సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ సమీపంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న పలు దుకాణదారులకు జీవీఎంసీ సిబ్బంది జరిమానా విధించారు. జీవీఎంసీ జోన్-8 కమిషనర్ మల్లయ్యనాయుడు ఆదేశాల మేరకు సచివాలయం కార్యదర్శి మణికుమార్, సూపర్‌వైజర్లు దమ్ము శ్రీనివావసరావు, సత్యనారాయణ, బి.వెంకటరావు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పలు షాపుల నుంచి మొత్తం రూ.8వేలు జరిమానా వసూలు చేశారు.

59వ వార్డులో అన్నసమారాధన

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్ సర్వీస్ మెన్ కాలనీలో కొలువుదీరిన బంగారమ్మతల్లి పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రామ్మోహన్‌నాయుడు, గ్రామస్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.